# రాత్రించారిణి లలిత

(కథానిక)

కిటికీలోనుంచి తొంగిచూచాడు శేఖర్. అంతా గాఢాంధకారం. పొగలు గ్రక్కుతూండే ఇంజనునుండి వచ్చే నిప్పు రవలు మినహా ఏమీ కనపడటంలేదు. నిప్పు రవలు వేగంగా వచ్చి పైన పడుతూన్నాయి. అతను చేరవలసిన ప్రదేశం ప్రక్క స్టేషనే. కిటికీ తలుపుదించి వాచీ చూశాడు. పదకొండున్నర అయింది. ఒక్కసారి అంతా సర్దుకొని సామానులు చేత పట్టుకొని నిల్చున్నాడు. సామాను లేవీ ఎక్కువ లేవు. ఒక్క లెదరు సూట్‌కేసు, హేండు బ్యాగ్ మాత్రమే.

రైలు సిగ్నల్ కేబిను దాటింది. లైట్లు అక్కడక్కడ కనబడుతూన్నాయి. స్టేషను చేరి రైలు ఒక్క ఊపుతో నిలిచింది. శేఖర్ ప్లాటుఫారంమీద నుంచున్నాడు. అతనికి ఎటు పోవలెనో తెలియలేదు. ఆ ఊరు క్రొత్త.

శేఖర్ ప్రసిద్ధ చిత్రకారుడు ఇప్పుడు. ఆ ఊరి జమీందారుగారు అతనిని పిలిపించారు. కాని శేఖర్ చేసిన తెలివి తక్కువ పని ఏమిటంటే ఒక ఉత్తరం ముక్కైనా జమీందారు గారికి వ్రాయకుండా వచ్చి దిగటం. కాని తీరా వచ్చేసిం తర్వాత ఏమి చేయడం? సరిగ్గా అర్ధరాత్రి సమయం. ఎక్కడా జనసంచారం లేదు. ఎలా వెళ్ళటం? అతను ఈమీమాంసలో పడి కొట్టుకుంటూండగానే అతను ఒక కంఠస్వరం విని తిరిగి చూచాడు.

ఒక పదహారేళ్ళమ్మాయి "ఏమండీ ఎక్కడికెళ్ళాలి" అని అడుగుతూంది. ఒకనల్ల పట్టు చీర, జరీఅంచు ఎఱ్ఱ రవిక వేసుకొని ఉంది. మనిషి అందంగానే ఉంది. ఈ ఆకస్మిక సంఘటనకు శేఖర్ చకితుడయ్యాడు.

"ఈ ఊరి జమీందారుగారింటికి వెళ్ళాలి. నాకు ఇల్లు తెలియదు. ఎవరిని అడుగుదామా అని ఆలోచిస్తున్నాను."

"నేనూ ఈ రైలులోనే వచ్చాను. మా వాళ్లుకూడ ఎవరూ రాలేదు. రండి వెడదాం. నేను జమీందారుగారి ఇల్లు చూపిస్తాను."

శేఖర్ కేమీ తోచలేదు. అర్ధరాత్రివేళ పరాయి ఆడదానితో ఒంటరిగా వెళ్ళటమా లేక ఆరాత్రి స్టేషనులోనే గడిపి ప్రొద్దున్నే వెళ్ళటమా అని ఆలోచిస్తున్నాడు. అతని కేమీ తోచలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు."

"అబ్బే! ఏమీలేదు. ఈ వేళటప్పుడు వెళ్ళి వాళ్ళను లేపటమా, ఈరాత్రి కిక్కడే ఉండి."

"అదేమిటండీ! వాళ్లేమనుకోరు లెండి ఇప్పుడే రైలు దిగివస్తున్నానంటే ఏమనుకుంటారు? ఫరవాలేదు నడవండి" అంది.

గత్యంతరం లేక శేఖర్ ఆమెను అనుగమించాడు.

"ఏదైనా పనిమీద వెళ్తూన్నారా" ఆమె ప్రశ్న ఆ నిశీథనిశ్శబ్దాన్ని భంగపరచింది.

"అవును. నేను చిత్రకారుణ్ణి. వారింటిలో ఏవో చిత్రాలు గీయాలని పిలిపించారు."

"మీరు చిత్రం ఏదైనా ఫోటో చూసి వేస్తారా లేక మనిషిని చూస్తూ వేస్తారా."

శేఖర్ ఆ ప్రదేశమంతటిలోనూ గొప్ప చిత్రకారుడు. అతని కళ్లు గర్వంతో ప్రకాశించాయి. "ఒకసారి మనిషిని చూస్తే మరల చూడకుండా వేయగలను."

"నిజంగానా" ఆమె కౌతుకంగా అడిగింది.

సమాధానంగా నవ్వాడు. ఆమె కూడా నవ్వింది, శేఖర్ కెందుకో ఈ అపరిచిత యువతి మీద ఒకమాదిరి మక్కువ కలిగింది.

"నేనొకటి చెప్తాను చేస్తారా" అంది ఆమె.

ఏమిటి అన్నట్లు చూశాడు.

"నా బొమ్మ గీయాలి మీరు."

"..............."

"మరల నేను మిమ్మల్ని కలుసుకుంటాను. అప్పుడు చూస్తా మీ ప్రజ్ఞ."

---

"రాధ"

శేఖర్ విచలితుడయ్యాడు.

"మీ రెక్కడికి వెళ్ళాలి."

ఆమె దానికేమీ సమాధానం చెప్పకుండా నవ్వి "అదిగో. ఆ కనపడుతూండే మేడే జమీందారుగారిల్లు" అన్నది.

ఈ అమ్మాయికి ఈదారులన్నీ ఎలా తెలుసు? ఇంత నిర్భయంగా తిరుగుతూండేం చెప్మా అని ఆలోచించాడు. అతనికేమీ సమాధానం చిక్కలేదు. గేటుదగ్గరికి వచ్చారు.

"మీకు చాలా శ్రమ యిచ్చాను, క్షమించండి."

"అబ్బే దానికేమీ ఫరవాలేదు. నాకీ ఊరిలో తెలియని దారి లేదు. మీకు కొద్ది సహాయం చేసినదానిలో ఏమైంది?"

"మళ్లీ ఎప్పుడు కలుసుకోటం?"

"ఎప్పుడనుకుంటే అప్పుడే" అని ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వుకు ఆణిముత్యం విలువ కట్టాడు శేఖర్.

వాకిట్లో దర్వాన్ను లేపి తనను తెలియ చెప్పుకున్నాడు శేఖర్. జమీందారుగారు ఇంకా నిద్రపోలేదు. శేఖర్‌ను కలుసుకొని చాలా గౌరవంగా మాట్లాడారు.

"ఒక్క ఉత్తరం ముక్క పడేసి ఉంటే ఎవరినైనా స్టేషనుకు పంపించే వాళ్ళంగదా. మీకు ఇల్లెలా తెలిసింది. సరే. ఇదంతా రేపు మాట్లాడుకోవచ్చు. అలిసి వచ్చినట్లున్నారు వెళ్ళి పడుకోండి" అని దర్వాను వేపుతిరిగి "వీరికి మేడమీదిఉత్తరపుగది కాళీచేసియియ్యి" అన్నారు.

శేఖర్ సెలవుతీసికొని దర్వాను వెంటనే వెళ్ళాడు. గది శుభ్రంగానే ఉన్నది. ప్రక్కన వరాండా. దర్వాను పడక ఒకటి తెచ్చివేసివెళ్ళి పోయాడు. శేఖర్ బట్టలు మార్చుకొని పండు కొన్నాడు. అతనికి నిద్ర రాలేదు. గంట పంన్రెండున్నర అయింది. కిటికీలోనుండి చల్లని గాలి వస్తూంది. శేఖర్‌కు ఆ అమ్మాయి జ్ఞాపకం వచ్చింది. ఎంత చొరవగా మాట్లాడింది. ఆమె పేరేమిటో చెప్పనేలేదు. తాను అడిగితేగా?

కొంచెంసేపు ఇలా ఆలోచిస్తూనే ఇటూ అటూ దొర్లాడు. ఇంతలో అతనికి ఆమె సవాల్ జ్ఞాపకం వచ్చింది. 'నా బొమ్మ గీయగలరా?'

చివుక్కున లేచి కూర్చున్నాడు. పెట్టెలో నుండి ఈసెల్ తీసి దానికి కాన్వాసు అమ ర్చాడు. రంగులు కలుపుకొని చిత్రం గీయటం మొదలుపెట్టాడు. అందాలకుంచె రంగులతో మెరుగులు దిద్దుతూఉంది. వేకువజామున నాలు గుగంటల ప్రాంతానికి చిత్రం పూర్తి అయింది. దూరంగా నిల్చుని దాని అందం పరికిస్తూ ఆఖరి సొంపులు దిద్దుతున్నాడు.

"ఎక్సెలెంటు" అని ఎవరోనవ్వుతూన్నారు. శేఖర్ కొట్టినట్టు వెనక్కు తిరిగి చూచాడు. "మీలో గొప్ప కళవుంది. నిజంగా చాలా బాగా వేశారు" అంటూ అతను స్టేషనులో కలుసుకున్న అమ్మాయి లోపలికి వచ్చింది.

శేఖర్ విస్మితుడయ్యాడు. "మీరెలావచ్చా రిక్కడకి, ఈ సమయంలో?"

"ఏం, ఆశ్చర్యంగా ఉందా? అయితే వినండి. మీలానే నేనుగూడ జమిందారుగారి అతిధిని. మీగదికి ఎదురుగదే నాది" అని మంద హాసం చేసింది.

"మరి నాతో చెప్పలేదేం?"

"మీతో చెప్పాలా ఏం?" అని నవ్వింది.

"మీతో కూడా ఎందుకు రావటం అని కొంచెం వెనుకగా వచ్చాను. మీరు చిత్రం ఇప్పుడే వేస్తూండడం చూసి వచ్చాను. తప్పయితే క్షమించండి వెళ్తాను" అన్నది.

శేఖర్ "అబ్బే, తప్పేం లేదు. మీరు రావటం మంచిదే అయింది. నేను వేసింది సరిగా ఉందా లేదా అని చూచుకునేం దుకు సహాయకారి అయ్యింది మీ రాక. నేను పొరపాటు చెయ్యలేదనుకుంటాను" అన్నాడు ఆమెవంక చూస్తూ.

నిజంగా ఆ చిత్రం ఆమెలాగే ఉన్నది. ఏమీ తేడాలేదు. పిసరంతైనా లేదు.

ఆమె మందహాసం చేస్తూ అతనివైపు తిరిగింది.

"ఇంతకూ మీ పేరు అడగటం మరచి పోయాను."

"నాపేరు లలిత. నిజంగా మీరు పొగడ దగినవారే. ఇంతకూ మీకు నిద్ర రావడం.

లేదూ?"

ఈ మాటలంటూ ఉంటే ఆమె మొహంలో నుదుటిమీదా కనురెప్పల క్రిందా నీడలు వ్యాపించినాయి. ఎలక్ట్రిక్ లైట్ వెలుతురులో మనోహరంగా ఉన్నది. శేఖర్ ఆమె స్నిగ్ధ సౌందర్యం చూస్తూ అలా నిలబడి పోయాడు.

ఆమె నవ్వుతూ "నేను సెలవు తీసుకుంటాను. నిద్రవస్తోంది. మీరు కొంచెం విశ్రాంతి తీసుకోండి" అని వెళ్ళిపోయింది.

రంగస్థలంమీది నటిలాగా రావటం పోవటం. శేఖర్ ఒక్క క్షణం ఆశ్చర్యంతో అలాగే ఉండి పోయాడు. ఆమె విచిత్రప్రవర్తనను గురించి ఆలోచిస్తూనే నిద్రపోయాడు. లేచేటప్పటికి బారెడు ప్రొద్దెక్కింది.

జమీందారుగారు అతనికోసం కాచుకొని ఉన్నారు. శేఖరం స్నానంచేసి డ్రెస్ చేసుకొని వచ్చాడు. కొంచెంసేపు ఇదీ అదీ మాట్లాడుకొని ప్రస్తుతానికి వచ్చారు.

"బాబూ. ఉండినదే ఒక కన్న. దానిని పోగొట్టుకొని అల్లాడుతూన్నాను. ఇప్పటికి వుండి ఉంటే పెండ్లివయసు పదహారేండ్లు. మా తల్లి. ఫోటో ఉన్నది, పంద్రెండేళ్ళ వయసుది. దానిని చూచి మామూలు సైజులో /.."

"చిత్రం" అన్నాడు వినయంతో శేఖర్.

"స్వల్పకారణానికే నా తల్లికి ముంచుకొచ్చింది. అప్పటినుండి ఆమెతల్లి...అదిగో...క అని చూపించాడు జమీందారు. ఒకప్రక్కన జమీందారిణి దైన్యం, శోకం తాండవించుతూ కూర్చొని ఉంది. ఆమెను చూడగానే శేఖర్ నీరైపోయాడు.

"నీ కళకు తగిన బహుమతి యివ్వకపోము. ఇలా చెప్తూన్నానని ఏమీఅనుకోవద్దు. కొంచెం కాలం ఎక్కువ తీసికొనినా సహజంగా ఉండేటట్లు..."

ఒకక్షణం ఆలోచించాడు శేఖర్ "రాత్రి నేనొక చిత్రం వేశాను. దాన్ని చూస్తే మీ సంశయాలన్నీ తీరిపోతాయి!"

ఆ చిత్రాన్ని చూడగానే జమీందారిణి ఒక్క కేకవేసి క్రిందపడిపోయింది. జమీందారు నిస్తబ్ధుడైపోయాడు. కొంచెంసేపటికి తెప్పరిల్లుకొని విస్మయంతో చూస్తూండే శేఖరును చూచి "ఇది ఎవరిది నాయనా" అన్నాడు.

శేఖర్ కు ఆశ్చర్యం ఎక్కువైంది. "ఈమె మీ అతిథినని చెప్పిందే? ఈమె పేరు లలిత" అన్నాడు.

జమీందారు ఏమీ మాట్లాడలేదు. శేఖరు తాను ఆమె నెలా కలుసుకున్నదీ తర్వాత ఏం జరిగిందీ చెప్పాడు.

జమీందారు కళ్ళనుండి బొటబొట కారుతున్నాయి కన్నీళ్ళు. శేఖర్ కేమీ తోచలేదు. గద్గద స్వరంతో జమీందారు గారు చెప్పారు. ఆయన కుమార్తె, ఏకైక పుత్రిక లలిత. చనిపోయి ఒక సంవత్సరమైంది. ఆమె చనిపోయినప్పుడదే నల్లచీరఅదేజరీఅంచుఎర్రరవికవేసుకొని ఉండినది. "ఆమె నీకెలాతటస్థించింది బాబూ? నాకేమో అగమ్య గోచరంగా ఉన్నది" అని ముగించాడు.

శేఖర్ తల తిరిగిపోయింది. ప్రపంచమే తల క్రిందులయిందా అనిపించింది. మెల్లగా తడుముకుంటూ తన గదిలోనికి వెళ్ళాడు. ఎదుట గది జ్ఞాపకం వచ్చింది. చూచాడు తలుపు తాళం వేసి ఉంది. తలుపుపైనంతా సాలె గూడులు. ఆ గదిని ఎవరుగాని ఎప్పుడూ వాడినట్లు లేదు. తిరిగివచ్చి మంచంమీద పడుకున్నాడు. ఆమె నవ్వు మెరుపులా మెరిసింది. "నాకీదారులన్నీ తెలుసు...ఎప్పుడనుకుంటే అప్పుడు కలుసుకోగలను." శేఖర్ కళ్ళు తెరచి చూచాడు. ఎవరూ లేరు.

అయితే తాను చూచినది ఎవరిని? ఎవరి చిత్రం తాను వేసినది. అతని మనస్సు కలత పడింది. ఎంత మరచిపోదామన్నా ఆమె ముఖం మరపుకు రావటంలేదు. ఆమె చిరునవ్వు అంతకన్నా.

మరుసటిదినం సాయంత్రం శేఖరం తన ఊరికి బయలుదేరాడు. జమీందారుగారు కొన్ని పచ్చనోట్లు ఇచ్చారు. శేఖర్ వానిని తీసుకోలేదు. "క్షమించండి నా కక్కర్లేదు" అని మాత్రం అని వెళ్ళిపోయాడు. ఆ మసక వెలుతురులో అతని మ్లానవదనంలోనివ్యథను, అతని సజల నేత్రాలను జమీందారు గమనించలేదు.